క్లుప్తంగా

మొండి బకాయిలు చెల్లించండి

- తక్కువ వడ్డీకే వ్యవసాయ, బంగారు రుణాలు
- సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్

గంగవరం: వ్యవసాయ, బంగారు తదితర రుణాలు అతి తక్కువ వడ్డీకి ఇస్తున్నట్టు స్థానిక సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ కృపానంద్ తెలిపారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడారు. పంట రుణాలు పొందిన వారు ఏడాదిలోపు తిరిగి చెల్లిస్తే 7 శాతం వడ్డీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని, అలా కాకుండా గడువు ఏడాది దాటితే వడ్డీ 12 నుంచి 13శాతం పెరిగే అవకాశం ఉంటుందని, ఆ మొత్తం భారం రుణాలు పొందిన వారిపై పడకుండా ఉండటానికి లోన్లు సక్రమంగా చెల్లించాలని కోరారు. అలాగే, బంగారు రుణాలు కూడా ఇదే తరహాలో చెల్లించాలని, అలాగే ల్యాంప్(లోన్ అగైనెస్ట్ మార్ట్‌గేజ్ ప్రాపర్టీ) గృహ రుణాలను నెలకోసారి సక్రమంగా కంతులు చెల్లిస్తే ఎలాంటి వడ్డీ భారం పడదన్నారు. బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై రెండేళ్లకు పబ్లిక్ ఖాతాదారులకు 7.60 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్లకు 8.10 శాతం వడ్డీ చెల్లిస్తున్నట్టు చెప్పారు. ఇదిలా ఉండగా బ్యాంకులో వివిధ రుణాలు మొండి బకాయిలు ఉన్నాయని, బకాయిదారులు సక్రమంగా చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఒకేషనల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు


ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లతో విద్యార్థులు


రొంపిచెర్ల: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లను ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి సోమవారం ప్రదానం చేశారు. దసరా సెలవుల్లో పదవ తరగతి విద్యార్థులు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో రీటెయిల్ ట్రేడ్‌లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు. పది మంది విద్యార్థులకు ప్రభుత్వం సర్టిఫికెట్లను మంజూరు చేసింది. హెచ్ఎం మాట్లాడుతూ, విద్యలో వృతి శిక్షణ విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. వృతి విద్య శిక్షణతో ఉద్యోగాలు సులువుగా వస్తాయని పేర్కొన్నారు.విద్యార్థులు త్వరితగతిన స్థిరపడేందుకు వృతి విద్య కోర్సులను ఎంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయులు శశికుమార్, లోకనాథరెడ్డి, మునిలక్ష్మి, శ్రీనివాస రెడ్డి, దుర్గాప్రసాద్, హేమేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష


మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మానిటరింగ్ ఆఫీసర్ కృష్ణవేణి

రొంపిచెర్ల: రొంపిచెర్ల మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. 6వ తరగతిలో ప్రవేశం కోసం 99 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 82 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని ఏపీ మోడల్ స్కూల్ మానిటరింగ్ ఆఫీసర్ కృష్ణవేణి తనిఖీ చేశారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 25న ఫలితాలు విడుదల చేస్తామని, ఎంపికైన విద్యార్థులు ఈ నెల 30 నాటికి స్కూల్‌లో చేరాల్సి ఉంటుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరళ, ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



కుప్పం: కర్ణాటక నుంచి శాంతిపురం మండలం అనికెర మీదుగా ఆంధ్రాకు తరలి వస్తున్న కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ నాగరాజు తెలిపారు. 56 మద్యం బాటిళ్లను తీసుకొస్తున్న శివప్పను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలించినా.. బెల్టుషాపులు నిర్వహించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ దిలీప్, సిబ్బంది క్రిష్ణమాచారి, కళ్యాణ్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ టీచర్ల అడ్మిషన్స్ డ్రైవ్


అడ్మిషన్స్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఉర్దూ స్కూల్ టీచర్లు

పలమనేరు: పట్టణంలోని కాకాతోపు ఉర్దూ స్కూల్ ఉపాధ్యాయుల బృందం సోమవారం పట్టణంలో అడ్మిషన్స్ డ్రైవ్ నిర్వహించింది. ఇంటింటికీ వెళ్లి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ స్కూళ్లలో ఉన్న వసతులు, ప్రభుత్వ స్కూళ్లలో చదివితే ప్రభుత్వ పరంగా పొందే పథకాలు..మొదలైన వాటిని వివరించారు. పాఠశాల హెచ్ఎం మునాఫ్, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మళ్లీ మట్టి పాత్రలు, కుండలకు ఆదరణ.!

మనిషి మట్టి నుంచి వచ్చాడు..మట్టి నుంచే మనుగడ నేర్చుకున్నాడు, ఆపై కాలక్రమంలో కంచు, రాగి, ప్లాస్టిక్, అల్యూమినియం ..తర్వాత ప్లాస్టిక్, వంటింట ఎలక్ట్రానిక్ ఉపకరణాలు మానవాళి జీవితాన్ని మరింత సుఖవంతం చేశాయి. అదే సమయంలో అల్యూమినియం, ఎలక్ట్రానిక్ ఉపకరణాల్లో చేసే వంటలు ఆరోగ్యంపై దీర్ఘకాలంలో దుష్ప్రభావం చూపుతాయని అధ్యయనాల్లో తేలడంతో మళ్లీ మానవ జీవితం మట్టి పాత్రలు, మట్టి కుండల వైపు మరలుతోంది. నాడు మన పూర్వీకులు ఎలాంటి అనారోగ్య సమస్యల్లేకుండా నిక్షేపంగా వందేళ్లు బతికేశారు. ఇప్పుడు చాలావరకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. మళ్లీ మట్టి పాత్రల వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా జిల్లాలో మట్టి పాత్రలు, కుండల వ్యాపారాలు సైతం ఊపందుకున్నట్టు స్థానిక టెర్రకోట హస్త కళాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



- ఎలక్ట్రానిక్ ఉపకరణాల కంటే ఇవే ఉత్తమం అంటున్న మహిళలు
- వంటల చేయడానికి ఇవే శ్రేష్టం
- వేసవిలో కుండనీరు ఆరోగ్యకరమంటున్న వైద్యులు
- పెరుగుతున్న మట్టి పాత్రలు, కుండల అమ్మకాలు

పలమనేరు: పూర్వం మనం వాడిన మట్టి పాత్రలకు బదులు అల్యూమినియం, స్టీల్ పాత్రల్లో వంటలు చేసే పద్ధతి నడిచింది. ఆపై కిరోసిన్ స్టౌవ్‌లు, ఇప్పుడు కరెంట్ కుక్కర్లు..మరింత అడ్వాన్స్‌గా నాన్‌స్టిక్, స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు రాజ్యమేలుతున్నాయి. ఇలా వంటింట ఆధునికత తెచ్చిన విప్లవాత్మక మార్పుల్ని స్వాగతించిన మహిళలే ఇప్పుడు మళ్లీ పాత విధానాలపై వైపు మొగ్గు చూపుతుండటం ఆసక్తికర పరిణామం.

ఫ్రిడ్జ్ కంటే మట్టికుండలే మేలు

వేసవిలో ఫ్రిడ్జ్‌లోని నీళ్లను ప్లాస్టిక్ బాటిళ్లలో పెట్టి తాగడం ఇప్పటిదాకా మనం చేస్తున్న విధానం. అయితే ప్లాస్టిక్ బాటిళ్లతో ఉంచే నీటి వలన, ఫ్రిడ్జ్ నీటితో వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన పెరుగుతోంది. ఫలితంగా ఈ వేసవిలో చాలా ఇళ్లలో మంచినీటి కుండలు దర్శనమిస్తున్నాయి. ఆరోగ్యానికి ఇదే శ్రేష్టమనే భావన ఇప్పుడు మళ్లీ పట్టణ ప్రజలకు కలుగుతోంది.

మట్టి పాత్రల్లోనే భోజనం, కూరలు

ఇప్పటి వరకూ మనం వాడిన కుక్కర్లు, కడాయిలు, జగ్గులు, గ్లాసులు, కప్పుల స్థానంలో మట్టివి, చెక్కవి పట్టణాల్లో అందుబాటులోకి వచ్చాయి. అంతెందుకు ఆన్‌లైన్‌లోనూ మట్టి పాత్రలు, గిన్నెలు, మట్టి వాటర్ క్యాన్లు, చెక్క వంటసామగ్రి లభిస్తుండడంతో ఆన్‌లైన్‌లోనూ ఈ వ్యాపారం జోరందుకుంది.

మట్టిపాత్రలు ఆరోగ్యానికెంతో మేలు

మట్టి పాత్రలతో ఎలాంటి కాలుష్యం ఉత్పన్నం కాదు. మెటల్‌తో పోల్చితే ఇందులో ఆహారం మెత్తగా ఉడికి రుచికరంగా ఉంటుంది. మట్టికి హీలింగ్ ఎనర్జీ ఉండడం దాని సహజ గుణం. వీటిలో క్షారగుణం ఉండడం వలన ఆహారం ఎంతో రుచిగా మారుతోంది. టీ, కాఫీలు సైతం ఘుమఘుమలాడాల్సిందే. ముఖ్యం నాన్‌వెజ్ వంట కాలైన నాటుకోడి పులుసు, మటన్ కర్రీ, చేపల పులుసు, బొమ్మిడాయల కూర ఓ సారి మట్టి పాత్రల్లో చేసి తింటే నాసామి రంగా.. ఆ రుచే వేరప్పా! అనేవాళ్లూ ఉన్నారు. దీంతోపాటు మట్టి పాత్రలు పెద్దగా నూనెను వేయాల్సిన పనిలేదు. మట్టి పాత్రలను శుభ్రం చేసేటపుడు ఎలాంటి డిటర్జెంట్లను వాడాల్సిన పనీలేదు. కేవలం బూడిద లేదా చింతపండు, నిమ్మకాయ వేడినీటితో కొబ్బరిపీచుతో శుభ్రం చేసుకోవచ్చు. దీంతో మట్టి పాత్రలు చాలాకాలం మన్నికగా ఉంటాయి.


పలమనేరు టెర్రకోట కాలనీలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి పాత్రలు, కుండలు, మట్టి క్యాన్లు



డిమాండ్ బట్టి పంథా మార్చుకున్న టెర్రకోట కళాకారులు

జిల్లాలోనే ఎక్కువగా టెర్రకోట హస్తకళాకారులు పలమనేరు సమీపంలోని గంటావూరు టెర్రకోట కాలనీలో ఉంటున్నారు. ఇక్కడ సుమారు వందకు పైగా మట్టిబొమ్మల దుకాణాలున్నాయి. మారిన పరిస్థితుల దృష్ట్యా డిమాండ్‌ను బట్టి మట్టి కుండలు, మంచినీటి కుండలు, నీళ్లక్యాన్ల వ్యాపారం జోరందుకుంది. మట్టి పాత్రలు రూ.వందనుంచి అందుబాటులో ఉన్నాయి. ఇక ట్యాప్ కలిగిన మట్టి క్యాన్ ధర రూ.200 నుంచి రూ.300 దాకా పలుకుతున్నాయి. వంటింటికి అవసరమైన మట్టి పాత్రలు, పరికరాలు కారు చౌకగానే ఉండడంతో ప్రజలు వీటిని కొంటున్నారు.



ఇది శుభ పరిణామమే..ఆరోగ్యకరమే



గతంలో సిటీలో అవసరమైన పూలచెట్లను పెంచే కూజాలు, ఇంటీరియల్ డెకరేషన్ పరికరాలను ఎక్కువగా చేసేవాళ్లం. కానీ ఇప్పుడు ఎక్కువగా వంటకోసం వినియోగించే మట్టి పాత్రలు, గిన్నెలు, మంచినీటిని తాగేందుకు మట్టికుండలు, ట్యాప్ అమర్చిన మట్టిపాత్రల అమ్మకాలు బాగున్నాయి. వేసవిలో ఫ్రిడ్జ్ కన్నా మంచినీటి కుండలో నీరు తాగితే మంచిదనే ఫీలింగ్ ప్రజలకు వస్తుండటం శుభపరిణామమే.

–రామకృష్ణ, టెర్రకోట హస్తకళాకారుల సంఘం అధ్యక్షుడు, గంటావూరు

ఎలాంటి కెమికల్స్ ప్రభావం ఉండదు



మనం సాధారణంగా వంటకు అల్యూమినియం, స్టీల్‌పాత్రలు వాడుతుంటాం. మంచినీటిని ప్లాస్టిక్ బాటిళ్లలో తాగుతుంటాం. దీని కారణంగా కెమికల్ ప్రభావం ఖచ్చితంగా ఉంటుంది. పాత్రలు వేడి అయినప్పుడు మనం తినే ఆహారంలో వాటి శాతం మిళితమవుతుంది. అదే మట్టిపాత్రలైతే ఎలాంటి ఆరోగ్య సమస్యలుండవనే ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. దీంతో మట్టితో తయారైనవి మేలని జనం నమ్ముతున్నారు.

–యుగంధర్, ప్రభుత్వ వైద్యులు, పలమనేరు

నోటీస్ బోర్డు

● ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువు నేడే ఆఖరు

గుడుపల్లె: మార్చిలో ఇంటర్‌మీడియెట్ పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ రాసేందుకు ఫీజు గడువు 22వ తేదీ మంగళవారం ముగియనుందని, విద్యార్థులు జాప్యం చేయకుండా ఫీజు చెల్లించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామక్రిష్ణమనాయుడు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు మే 12 నుంచి 20వ తేదీ వరకు, ప్రాక్టికల్స్ మే 28 నుంచి జూన్ 1వ తేదీ నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

● నేడు కల్యాణోత్సవం

గంగవరం: శ్రవణానక్షత్రం సందర్భంగా మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర సోమవారం తెలిపారు. రూ.300 చెల్లించి సంప్రదాయ దుస్తులతో భక్తులు హాజరు కావాలని కోరారు.

● ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుడుపల్లె: ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు మే10వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. అభ్యర్థులు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్‌కార్డులు కలిగి ఉండాలని, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని, అలాగే ఒక కాపీని సచివాలయంలో ఇవ్వాలన్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలకు తమ కార్యాలయం లేదా సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

● 25న నూర్‌షావలి దర్గా ఉరుసు

పుంగనూరు: పట్టణంలోని చెరువు కట్టపై ఉన్న హజరత్ సయ్యద్‌నూర్‌షావలి బాబా దర్గా వద్ద ఈనెల 25 ఉరుసు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 25న గంధం, 27న ఖవ్వాలి, 28న తహలీల్ ఫాతేహా నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

● రేపటి నుంచి శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాలు

పుంగనూరు: మండలంలో చదళ్లలోని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 23 నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ధర్మకర్త వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన గ్రామస్తులతో కలసి ఉత్సవాల పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ప్రతి రోజూ హోమాలు, అభిషేక పూజలు, భక్తులకు అన్నదానం చేయనున్నట్టు చెప్పారు.

పవన్ కళ్యాణ్‌కు ఇది కనబడదా..?

- డిప్యూటీ సీఎం నియోజకవర్గంలో దళితులకు అన్యాయం
- మల్లాం ఉదంతంపై బస్టాండు వద్ద నిరసన

చౌడేపల్లె:డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాం గ్రామంలో దళితులను గ్రామ నుంచి బహిష్కరించడం దుర్మార్గం, శోచనీయమని, ఇంతటి వివక్ష పవన్ కళ్యాణ్‌కు కనబడటం లేదా? అని సీఐటీయూ మండల కార్యదర్శి డాక్టర్ చంద్ర ప్రశ్నించారు. మల్లాం ఉదంతాన్ని నిరసిస్తూ సోమవారం కుల వివక్ష పోరాట సమితి మండల అధ్యక్షుడు వాసుతో కలిసి బస్టాండులో ధర్నా, రాస్తారోకో చేశారు. ఆయన మాట్లాడుతూ, మల్లాంలో అగ్రవర్ణ కులాల వారు దళితులపై దాడులు చేయడం, వివక్ష చూపడం, టీ స్టాల్స్ వద్దకు రానివ్వకపోవడం అప్రస్వామ్యమని నిరసన వ్యక్తం చేశారు. దళితులను బహిష్కరణ చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో దళిత సంఘం నేతలు హరిబాబు,శేఖర్, రాఘవ, క్రిష్ణప్ప, గుర్రప్ప, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న సీఐటీయూ, కేవీపీఎస్ నేతలు

నేటి నుంచి చిట్రెడ్డిపల్లెలో గంగజాతర

చౌడేపల్లె: మండలంలోని చిట్రెడ్డిపల్లెలో మంగళవారం నుంచి రెండు రోజులపాటు గంగజాతర నిర్వహించనున్నారు. తొలిరోజు రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, సాంప్రదాయబద్ధంగా కళ్యాణోత్సవం నిర్వహించిన అనంతరం నడివీధిలో కొలువుదీరుస్తారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


టి.వడ్డూరులో నిర్వహిస్తున్న వార్షికోత్సవం

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత విద్యార్థులతో టీచర్లు సరస్వతి పూజ చేశారు. గ్రామ సర్పంచ్ మునస్వామి ముఖ్య అతిథిగా హాజరై పిల్లలకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఎంఈఓ బాలసుందరం పిల్లలనుద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రులు, పిల్లలు, టీచర్లు పాల్గొన్నారు.

30లోపు ఆస్తిపన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

పుంగనూరు: మున్సిపాలిటీకి చెల్లించాల్సిన వివిధ రకాల పన్నులపై ఈ నెల 30వ తేదీ వరకు 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ముందుగా ఆస్తిపన్నులు చెల్లించే వారికి 5 శాతం రాయితీ, అలాగే పన్ను బకాయిలు చెల్లించే వారికి వడ్డీలో 5 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. భవన యజమానులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి అర్జీ పరిష్కరించాలి

- రెవెన్యూ సమస్యలపై అధికంగా ఫిర్యాదులు
- తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కడా పీడీ వికాస్ మర్మత్


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం: సమస్యలపై ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాలని కడా పీడీ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం అధికారులతో ఆయన సమీక్షించారు. గ్రామీణ ప్రజల ఫిర్యాదులపై అధికారులు స్పందించాలని, ప్రధానంగా రెవెన్యూ సమస్యలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నట్లు చెప్పారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలని, దీంతో పాటు రహదారులు, సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం.. ఇత్యాది వాటికి ప్రతిపాదనలు సిద్ధ చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి అందిన వినతులను ఆయా శాఖలకు పంపుతున్నామని, వీటిని జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయిలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొత్తం 25 ఫిర్యాదులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 25 ఫిర్యాదులు ప్రజల నుంచి అందాయని కడా కార్యాలయం తెలిపింది. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 17, భూ రికార్డులకు సంబంధించి 4, పోలీసు శాఖకు సంబంధించి 3 ఫిర్యాదులు అందినట్లు తెలియజేసింది.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు హైస్కూల్లో విద్యార్థులతో సోమవారం పీర్ గ్రూప్ ప్రహరీ క్లబ్ ఏర్పాటు చేశారు. అనంతరం ఆ క్లబ్ సమన్వయకర్త వెంకట సిద్ధులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసలు కారాదని, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను వివరించారు. హైస్కూలు పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గుట్టుగా మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్టు గుర్తిస్తే తమకు సమాచారం ఇస్తే పోలీసులకు చేరవేస్తామన్నారు. ప్రహరీ క్లబ్ ఉద్దేశాలను తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు రాజేంద్ర, పద్మవేణి, మోహన్ పాల్గొన్నారు.


ప్రహరీ క్లబ్ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో టీచర్లు

రెవెన్యూ రికార్డులపై ఇంత నిర్లక్ష్యమా..?

పలమనేరు: పట్టణ సమీపంలోని ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి డివిజన్‌లోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది సంబంధిత రెవెన్యూ రికార్డులను దస్త్రంలో చుట్టి ఇక్కడికి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా ఎవరో అధికారి రికార్డులకు ఓ బైక్‌పై పెట్టి వెళ్లారు. దీన్ని గమనించిన అర్జీదారులు రికార్డులంటే అధికారులకు ఇంత నిర్లక్ష్యమా..? ఎవరైనా వాటికి పట్టుకుపోతే పరిస్థితి ఏమిటని చర్చించుకున్నారు.


బైకుపై ఉన్న మూట కట్టిన రెవెన్యూ రికార్డులు

ప్రజలకు హెచ్‌డీఎఫ్‌సీ మరిన్ని సేవలు

- బ్యాంకు క్లస్టర్ హెడ్ వెంకట సుబ్రమణ్యం

పుంగనూరు: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి మరిన్ని మెరుగైన సేవలు ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు బ్యాంకుల క్లస్టర్ (చిత్తూరు, తిరుపతి జిల్లాలు) హెడ్ వెంకటసుబ్రమణ్యం తెలిపారు. ఎంబీటీ రోడ్డులో అన్ని వసతులతో కూడిన భవనంలోకి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకును మార్చారు. లాకర్లు ఏర్పాటు చేశారు. సోమవారం దీనిని క్లస్టర్ హెడ్ సీఐ సుబ్బరాయుడుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడి బ్రాంచ్‌లో బంగారుతో పాటు వాహనాలు, గృహనిర్మాణాలకు, ఉద్యోగులకు , సీనియర్ సిటిజన్లకు విరివిగా రుణాలు ఇస్తామని, బ్యాంకు సేవలను పుంగనూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ రెడ్డిప్రసాద్, రిలేషన్‌షిప్ మేనేజర్ సీఎండీ ఫయాజ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, డాక్టర్లు ప్రభాకర్, శరణ్, షేక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకును ప్రారంభిస్తున్న క్లస్టర్ హెడ్ వెంకటసుబ్రమణ్యం, సీఐ సుబ్బరాయుడు

సిగరెట్ దెబ్బకు రూ.30వేలు నష్టం!

గడ్డివామి దగ్ధం

చౌడేపల్లె: నిర్లక్ష్యంగా తాగి పడేసిన ఓ సిగరెట్ మూలాన గడ్డివామి దగ్ధమై సుమారు రూ.30 వేల ఆస్తినష్టం వాటిల్లింది. ఈ ఘటన సోమవారం మండలంలోని కాగతిలో చోటుచేసుకుంది. బాధితుడు గంగులప్ప తెలిపిన వివరాలు..గంగులప్పకు చెందిన గడ్డివామి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడంతో మంటలు గడ్డివామికి వ్యాపించాయి. గమనించిన స్థానికులు పుంగనూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారమిచ్చారు. గ్రామస్తులు కలిసి మంటలను ఆర్పారు.



సంతలో తప్పిపోయిన బాలిక

- రెండు గంటల వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగింత

పుంగనూరు: తల్లిదండ్రులతో సంతకొచ్చిన ఓ ఆరేళ్ల బాలిక తప్పిపోయింది. ఆందోళన చెందిన ఆ బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. రంగంలో దిగిన పోలీసులు రెండు గంటల వ్యవధిలోనే బాలికను గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. సోమవారం ఈ సంఘటన పుంగనూరులో చోటుచేసుకుంది. వివరాలు.. స్థానిక కొత్తపేటలో నివాసం ఉన్న శోభారాణి, కిశోర్ దంపతుల తమ ఆరేళ్ల కుమార్తెతో కలిసి మధ్యాహ్నం సంతకు వెళ్లారు. కూరగాయలు కొనుగోలు చేసే పనిలో పడిన వారు కొంతసేపటికి చూస్తే తమ కుమార్తె కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. పరిసరాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. దీంతో ప్రతి సోమవారం పట్టణంలో జరిగే సంతలో ఓ ఆరేళ్ల బాలిక తప్పిపోయిన సంఘటన సోమవారం జరిగింది. పోలీసులకు సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ లోకేష్ , పోలీసులు పట్టణంలో జల్లెడ పట్టారు. సంతకు అర కిలోమీటరు పైచిలుకు దూరంలోని మారెమ్మగుడి సమీపంలో బాలిక ఉండటం గుర్తించారు. ఆ బాలికే నడచుకుని అక్కడికి వచ్చినట్లు తెలుసుకున్నారు. ఆ తర్వాత తల్లిదండ్రులకు అప్పగించారు.


బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ సుబ్బరాయుడు

మాకు వేతనాలు చెల్లించండి సారూ..!

ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది ర్యాలీ


ర్యాలీ చేస్తున్న ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది

కుప్పం రూరల్: రైతులకు ప్రకృతి వ్యవసాయంపై సలహాలు–సూచనలు ఇస్తున్న ఏపీ సీఎన్ఎఫ్ (నేచురల్ ఫార్మింగ్ వర్కర్స్ యూనియన్) సిబ్బందికి 2023 నుంచి రావాల్సిన వేతనాలు వెంటనే చెల్లించాలని సోమవారం ర్యాలీ నిర్వహించారు. కుప్పం బస్టాండు నుంచి కడా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్‌కు వినతి పత్రం అందజేశారు. ఏపీ సీఎస్ఎఫ్ ఉద్యోగులు మాట్లాడుతూ, 2023 జీతాలు ఇవ్వలేదని, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్నారు. అనారోగ్యం పాలైనా సెలవులు లేక పని చేస్తున్న తమకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో గంగరాజు, నాగరాజు, భారతి, హనుమంతు, మునికృష్ణ, శ్రీదేవి, వెంకటరమణ, జయరామ్ పాల్గొన్నారు.